# అభిప్రాయం

## - ఇచ్ఛాపురపు రామచంద్రం

కథ పూర్తి చేసి కవరులో పెట్టి పత్రిక అడ్రసు రాసి-స్టాంపులు కూడా అంటించి-వొళ్లు విరుచుకుంటూ గది బయటకు వచ్చాడు చతుర్వేది.

ఆదివారంనాడు సంసారానికి సి.యల్ (క్యాజువల్ లీవు) పెట్టేసి ఉదయం ఎనిమిదయ్యేసరికి స్నానం, టిఫిను వగైరాలన్నీ కానిచ్చేసి-ఫ్లాస్కుతో కాఫీ పట్టుకుని-మేడమీదున్న తన సాహిత్య గది కొచ్చేస్తాడు. అంతే. కథ పూర్తవ్వాలి. అతను మేడ దిగాలి. రాసిన కథను ఆదివారమే అయినా వెంటనే పోస్టు చేస్తాడు.

ఇవాళ అతను మేడ మీదకు బయలుదేరబోతుంటే ''ద్వాదశి పూటా కొత్త కథేమిటండీ? ద్వాదశి దగ్ధయోగమ్-అని మరచిపోయారా?'' అని వెనక్కి లాగబోయిందతని భార్య.

''సిగరెట్ కాల్చేటప్పుడు అదనపు జాగ్రత్త తీసుకుంటాలే. అంచేత నా కథ దగ్ధమయ్యే ప్రమాదం ఉండదు'' అని నవ్వేసి మేడ ఎక్కేసి కథ దీక్షలో మునిగిపోయాడు.

కొంచెం సేపట్లో చీకటి పడుతుందనగా ముగిసిందతని కథా యజ్ఞం. కథ-అనుకున్నట్లే వొచ్చినందుకు సంతృప్తితోనూ-కథ రాయడమయినందుకు హాయిగానూ అతను మెట్లు దిగబోతుంటే-

''నమస్కారం. సుప్రసిద్ధ కథారచయిత చతుర్వేదిగారు మీరే అనుకుంటా'' అంటూ వొచ్చాడు ముప్ఫయ్యేళ్ల యువకుడు.

''నేనే రండి.'' అంటూ అతన్ని గదిలోకి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు.

''నాపేరు రవికిషోర్. మీ మొదటి కథ నుంచి ప్రతికథా చదువుతూ వొస్తున్నాను. చాలా బాగుంటాయి. నేను మీ అభిమానిని. అన్నట్లు నేనూ రాస్తుంటాను. ఇప్పటికెనిమిది కథలు పత్రికలలో వొచ్చాయి. నేను మీ ఏకలవ్యశిష్యుణ్ణి. మీలాగే దైనందిన జీవితంలోని సంఘటనలనూ సమస్యలనూ సంఘర్షణలనూ కథా వస్తువులుగా తీసుకొని వాస్తవికమయిన కథలు రాయాలని, మిమ్మల్నునుకరించాలని చూస్తుంటాను. మిమ్మల్ని కలుసుకోవడం నాకు చాలా ఆనందంగా.. గర్వంగా..అదృష్టంలా.. గొప్పగా..'' చెబుతున్నప్పుడతని కళ్లల్లో ఆరాధన..అభిమానం..ఆనందం... మెరుపు.

చతుర్వేది చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. అతనందించిన అతని కథల కటింగుల ఫైలు చూస్తూ.

''నేనో కథ రాశాను సర్. మీరు చదివి..తప్పులు సవరించి..అభిప్రాయం చెబితే..'' భయం భయంగా అన్నాడు చేతిలో ఆ కథల కవరు పట్టుకుని.

''దానికే భాగ్యం? ఇటివ్వండి. ఇప్పుడే, యిక్కడే చదివేసి చెబుతాను.''

ఇల్లాగ అతనూహించలేదేమో. ఉబ్బితబ్బిబ్బవుతూ..కథలందిస్తూ ''థాంక్యూ వెరీమచ్‌సార్..కానీ సర్..ముందే మనవి చేస్తున్నాను. నేను మిమ్మల్ని కథావస్తువు స్వీకరించడం నుంచి శిల్పమూ శైలి వరకూ అనుకరిస్తానని..''



'తినబోతున్నానుగా' రుచులు చెప్పడమెందుకన్నట్లు నవ్వి-కథ చదవడం మొదలుపెట్టాడు. చదువుతూంటే..అతని ముఖంలో త్రుళ్లిపాటు..ఆశ్చర్యం..బాధ..విచారం..రకరకాల భావాలు.

''మీరు నిజంగా చాలా గ్రేట్ సర్. చాలా మంచివారు సర్. ఒక ప్రసిద్ధ రచయితకి..అభిప్రాయమూ, సవరణలూ, సూచనలూ చెప్పమని కథ వ్రాత ప్రతి యిస్తే..ఆ ప్లాటుతో ఆయన కథ రాసేసి తన పేరుతో వేసుకున్నారు..'' చతుర్వేది గతుక్కుమన్నాడా మాటలకి..

''మీరు దీనినేపత్రిక్కి పంపాలనుకుంటున్నారు? ఎందుకడుగుతున్నానంటే..పత్రికని బట్టి కథ..''

''లహరికి సర్''

చతుర్వేది-కథల కాగితాల మాటున తీవ్రమయిన ఆలోచనలో పడిపోయాడు.

''నాకథ మీద..మీ అభిప్రాయం'' బెరుకు బెరుకుగా అడిగాడు రవికిషోర్.

''ముందు యిది చదవండి'' కవరుని అందించాడు చతుర్వేదతనికి.

''అరె! మీరూ లహరికే పంపుతున్నారే యీ కథని!'' అంటూ అతను చతుర్వేది కథను చదవసాగాడు.

అతని ముఖంలో-త్రుళ్లిపాటు. కథ పూర్తి చేసేసరికతనికి చెమటలు పట్టేశాయి. మనిషి వొణికి పోసాగాడు. ''ఇది ఎలా సాధ్యం? ఎలా సంభమం? మీ కథ పేరు వెలుగు. నా కథ పేరు కాంతి. కథా వస్తువొక్కటే. మలచిన తీరు దాదాపు ఒక్కటే. ముగింపు ఒక్కటే. కాకపోతే మీరనుభవశీలురు కనుక మీ కథ మరింత ప్రతిభావంతంగా ఉంది. ఎవరేనా చదివితే మీ కథకి నా కథ చేతకాని కాపీ అనుకుంటారు. ఇది ఎలా సంభవించింది?''

''యాధృచ్ఛికం. ఇంగ్లీషులో కోయిన్సిడెన్స్. ఈ కథలు రెండూ మనం విడివిడిగా రాసినా అతి దగ్గరి పోలికలతో తయారయ్యాయి. స్వతంత్రంగా రాశామంటే నమ్మలేనంత దగ్గరగా వొచ్చాయి. మీరు నన్నుకరించటం కొంతవరకూ కారణం కావచ్చు. ఇప్పుడీ రెండు కథలు అనవసరం. ఏదో వొకటే చాలు. కథ ఎంత బాగున్నా రెండుసార్లు ముద్రించరుగా యిద్దరి పేర్లతో? బింబ ప్రతిబింబాల్లా ఉన్నాయివి. వీటిలో ఏదుండాలి?''

చతుర్వేది ప్రశ్నకి రవికిషోర్ జవాబు చెప్పలేకపోయాడు, అతనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోవడాన.

''ఇలా జరగడం అరుదే కాని అసంభవమూ అసాధ్యమూ మాత్రం కాదు. ముందే తెలిసింది కనుక పెద్ద ప్రమాదం తప్పింది'' అంటూ అతని చేతిలోంచి తన కథను తీసుకుని-సిగరెట్ అంటించుకుందుకన్నట్లు గీసిన అగ్గిపుల్ల మంటతో ఆ కాగితాలనంటించేశాడు. చతుర్వేది కథ మండిపోతోంది!

''సార్'' భోరుమన్నాడు రవికిషోర్, దుఃఖం ఆపుకోలేక. ''నా కథే కాల్చేయ్యవలసింది''

''ఇది న్యాయం..ఇదే న్యాయం..ఇప్పుడు నేను నా మీద ఏవిధమయిన అపప్రధా పడకుండా క్షేమంగా మిగిలాను. నా పేరుకి అపనింద ప్రమాదం లేదు. రవికిషోర్, యికపై మనం ప్రచురించబడిన కథల గురించే మాట్లాడుకుందాం. వ్రాత ప్రతి దశలోని కథల గురించి తెలుసుకోవద్దు. ఏం?'' అతని కేమీ అర్థం కాలేదు. అయినా-అలాగే అన్నట్లు తలూపాడు రవికిషోర్. మరేం చేయాలో తెలియక. చతుర్వేది కథ-వెలుగు-పూర్తిగా కాలిపోయి మసీ మసే మిగిలాయి.

★